వాడవాడలా మేడే సంబరాలు

- కదంతొక్కిన కార్మికులు
- పట్టణాల్లో, గ్రామాల్లో ఎర్రజెండా విష్కరణ
- వీధుల్లో ర్యాలీలు, సభలు, సమావేశాలు

అలంపూర్: ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, సీపీఎం మండల కార్యదర్శి నరసింహులు నినదించారు. అలంపూర్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం 138వ మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులకు పదేళ్లుగా వేతనాలు పెంచకుండా పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచిందన్నారు. మతం పేరు చెప్పి మళ్లీ మోసం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పి సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రఫిక్, మాలిక్, కేవీపీఎస్ నాయకులు అయ్యప్ప, అంగన్‌వాడీ టీచర్లు రూపప్రియ, భారతి, పుష్పవతి, రాజమ్మ, ఆశా వర్కర్లు నాగేశ్వరమ్మ, ఆటో డ్రైవర్లు శ్రీనివాసులు, మర్దన్, అంజి, మున్సిపల్ కార్మికులు లక్ష్మీదేవి, ఏసేపు, లక్ష్మన్న, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

అలంపూర్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దబాబు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రేషన్ చట్టం అమలయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయిలో మేడే వేడుకల సందర్భంగా సీఐటీయూ నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక, కర్షక, నిరుద్యోగ రైతాంగా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతున్న ఎర్రజెండాను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రామచంద్రుడు, రామకృష్ణ, గౌస్, కలాం పాల్గొన్నారు.


అలంపూర్‌లో మేడే వేడుకల్లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు


ఎర్రవల్లిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గట్టు: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మండలంలోని బస్టాండ్ ఆవరణలో హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు జయన్న, చంద్రు, వెంకటేష్, స్వామి, బల్లరాముడు, శాంతప్ప పాల్గొన్నారు. బల్గెరలో మే డే సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ అ ధ్యక్షుడు హనుమంతునాయుడు జెండావిష్కరణలో పాల్గొన్నారు. మాచర్లలో ఉపాధి హామీ పనులు జరి గే చోట మేడేను నిర్వహించారు. కార్యక్రమంలో జి ల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లావణ్య, జయమ్మ, లక్ష్మి, అర్జున, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను కాంగ్రెస్ మండల నాయకులు డీఆర్ శ్రీధర్ ఎగురవేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి జెండా ఎగురవేశారు. జూరాల వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంటు వద్ద మేడే కార్యక్రమంలో చింతరేవుల ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్రిష్ణ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు రాజారెడ్డి, కుర్వ శ్రీను, వెంకటేష్ నాయుడు, ఏఐటీయూ నాయకులు ప్రకాష్, హమాలీ సంఘం నాయకులు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కొండేరులో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తిక్ హమాలీ కార్మికులతో కలిసి ఎర్రజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

శాంతినగర్: కార్మిక, కర్షకులు ప్రతి ఏటా మే 1న మే డే వేడుకలు వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్, మండలంలోని తనగలలో ఘనంగా నిర్వహించారు. శాంతినగర్ సెంటర్‌లో ఎర్ర జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, హమాలీ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

అయిజ: మేడే స్ఫూర్తితో కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధమవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ అన్నారు. మండల కేంద్రంలో హమాలీ సంఘం కార్యాలయం దగ్గర జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈశ్వర్, పెద్ద రాముడు, తిరుమల్ నరసింహులు, భీమన్న, నాగరాజు, ఏసేపు, రాజు, సవారి, యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మే డే సందర్భంగా కార్మికులు, హమాలీ, సెంట్రింగ్, భవన నిర్మాణ, ఆటో యూనియన్ సభ్యులు కార్మిక జెండాను ఎగురవేశారు. 8 గంటల పని విధానం ప్రవేశపెట్టేందుకు ఐక్యంగా ఉండాలని మండల సీఐటీయూ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్లు, హమాలీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించిన రోజే మేడే అని పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు నందిన్నె, తదితర గ్రామాల్లో మేడే కార్మికుల దినోత్సవ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు ఆంజి జెండాను ఎగురవేశారు.

మల్దకల్: మే డే వేడుకలు మండలంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ అనుబంధ సంఘాల నాయకులు సంజీవులు, అంజి, కర్రెప్ప, గంగన్న , తిమ్మప్ప, బద్రి, సవారన్నలు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు, హమాలీలు ఉన్నారు.

రాజోళి: సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీయూటీయూ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, లక్ష్మన్న, తిక్కన్న, జయన్న, అడివన్న, పురుషోత్తం, నర్సింహులు, దావీదు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మానవపాడు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవర్గం బీజేపీని ఓడించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. మండల కేంద్రంలో ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.


లింగన్‌వాయిలో..


ధరూరులో..


రాజోళిలో..


గట్టులో..


అయిజలో..


ఉండవెల్లిలో..


కేటీదొడ్డిలో..


మల్దకల్‌లో..

బీఆర్‌ఎస్‌కే టీఎస్ ఎమ్మార్పీఎస్ మద్దతు



అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో టీఎస్ ఎమ్మార్పీఎస్ బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర హుస్సేన్ మాదిగ ప్రకటించారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేట్ కళాశాలలో టీఎస్ ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మూడు రిజర్వు సీట్లు ఉండటంతో జనాభా దామాషా ప్రకారం రెండు ఎంపీ సీట్లను కాంగ్రెస్ మాదిగలకు కేటాయించాల్సి ఉందన్నారు. కానీ ఒక్క ఎంపీ స్థానంలో మాదిగలకు అవకాశం కల్పించలేదన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో, నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలను విస్మరించిందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్‌ప్రవీణ్ కుమార్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమదాస్ మాదిగ, జిల్లా గౌరవ అధ్యక్షుడు హుసేన్, జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుమన్ మాదిగ, ప్రధాన కార్యదర్శి నరేష్ మాదిగ, తాలూకా కన్వీనర్ నవీన్, జయన్న, భాస్కర్, విష్ణు, నరసింహ, చాంద్, సుధాకర్, మద్దిలేటి, శ్యాంరాజు, రమేష్, రాముడు, నవీన్, హుస్సేన్ ఉన్నారు.

మోసపూరిత హామీలిచ్చే పార్టీలను తరిమేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: మోసపూరిత హామీలిచ్చే పార్టీలను తరిమికొట్టాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని చాగాపురం, షాబాద్ గ్రామాల్లో ఆయన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటి వరకు గ్యారంటీలను మరిచిందన్నారు. మన హక్కులను కాపాడుకునేందుకు భారత రాజ్యాంగమే ఏకైక ఎజెండాగా పనిచేస్తున్న బీఎస్పీకి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

విద్యార్థుల తల్లిదండ్రులు సహనం కోల్పోవద్దు

రాజోళి: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల మార్కుల పట్ల సహన కోల్పోవద్దని ఎంపీపీ మరియమ్మ అన్నారు. మంగళవారం వెలువడిన పది పరీక్షా ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారని, కొందరు తక్కువ మార్కులు రావడం, కొందరు పరీక్షలు తప్పడం సహజమని, దీని పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సహనం కోల్పోయి పిల్లలపై ఆగ్రహం వ్యక్తం చేస్తే, వారి మనసు నొచ్చుకుని కఠిన నిర్ణయాలకు పాల్పడతారని, అలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. వారికి ధైర్యం చెప్పి, మరింత ప్రోత్సాహాన్ని అందించి ముందుకు పంపేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

నేడు అఖిలపక్ష సమావేశం

అయిజ: మండల కేంద్రంలో పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని అధికారులపై వత్తిడి తెచ్చేందుకు గురువారం అంబేద్కర్ చౌరస్తాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు ఉదయం 9 గంటలకు అఖిల పక్ష సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో బుధవారం ఘనంగా ఈదమ్మ జాతర సందర్భంగా పురుషుల ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించారు. దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాలుగవ బహుమతి రూ.5వేలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో 30 టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో దాతలు మోహన్‌రెడ్డి, గోవర్ధన్, వెల్దుర్తి భాస్కర్, జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్, ఎంపీపీ బేగం, తిప్పారెడ్డి, ఎండీ ఇబ్రహీం, నిర్వాహకులు నరేందర్, తిరుమలేష్, హరికృష్ణ, పరశురాం, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

శాంతినగర్: అయిజ మండలం మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్ బుధవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిని ఏఐసీసీ కార్యదర్శి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అయిజ మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బజారి గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్కూరు శ్రీనివాసులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఇరువురు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట వెంకటేష్ యాదవ్, జయచంద్రారెడ్డి, మందా జగన్నాథం, నర్సింహులు, యువరాజ్ ఉన్నారు.

ఓటర్లకు అందని స్లిప్పులు

కేటీదొడ్డి: ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలో ప్రతి ఇంటికి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని అధికారులు బీఎల్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు. కేటీదొడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు పంచాయతీ దగ్గర ఓటర్ స్లిప్పులు అందుబాటులో ఉన్న వారికి అందజేస్తున్నారు. దీంతో తమకు ఓటర్ స్లిప్పులు అందడం లేదని ఓటర్లు ఆరోపిస్తున్నారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అ య్యప్ప స్వామికి బుధవా రం అర్చకులు ఆంజనేయ శర్మ పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. బుధవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని గుంతలో శవం లభ్యం కాగా, కర్నూల్ పట్టణం, కప్పల్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్(20)గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కర్నూల్ పట్టణం, కప్పల్ నగర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్(20) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో స్నేహితులను ఆశ్రయించినా తమ దగ్గరికి రాలేదని తెలిపారు. ఉదయం పుల్లూరు శివారులో అతని బైక్ లభ్యం కావడంతో కొందరు వ్యక్తులు గుంతలలో పడిన మృతదేహాన్ని గుర్తించి పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ పోలీసులు ఎస్ఐ శ్రీనివాసులకు సమాచారం ఇవ్వగా, మృతుదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం అబ్దుల్ ఖదీర్‌గా గుర్తించారు. తల్లి ఫాతీమాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కష్టపడదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కష్టపడదామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఉండవెల్లి, మానవపాడు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు మాట్లాడారు. మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కష్టపడ్డాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడవకముందే కరువు కాటకాలు వచ్చాయన్నారు. ఎన్నికల్లో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అభివృద్ధికి నిధులు మంజూరు


మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

అలంపూర్: రెండు మండలాల్లోని పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఉండవెల్లి ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో ఉండవెల్లి, మానవపాడు మండలాల హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈఓ శివప్రసాద్, పంచాయతీ రాజ్ డీఈ ఆంజనేయులు, ఏఈలు బాలాజీ, భరత్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గతంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ ఏఈలు పాఠశాలలను సందర్శించి అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించినట్లు తెలిపారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన నిధులు మంజూరైనట్లు తెలిపారు. 40 రోజుల్లో నాలుగు భాగాలుగా విభజించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 25 శాతం నిధులు ఆయా పాఠశాలకు విడదల చేయనున్నట్లు వివరించారు. ఆ నిధులతో 10 రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత మరో 25 శాతం నిధులతో మరో పది రో జుల్లో పనులు చేపట్టాల్సి ఉంటుందని సూచించారు. వచ్చిన నిధులతో పాఠశాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఫ్లోరింగ్ పనులు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఎస్‌ఓలు రా మకృష్ణ, విష్ణు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

ఎండలకు జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా తాన్వీర్

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీవ్రమైన ఎండలు, వడగాలులు వీస్తున్నాయని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా వైద్యాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశానుసారం రానున్న వారం రోజులు తీవ్రమైన ఎండలు 45 డిగ్రీలు ఉన్నాయన్నారు. ఉదయం 11గంటల నుంచి 4గంటల మధ్య ఇళ్ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు అవసరమని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని తెలిపారు. ఉపాధి హామీ పనిచేసే కూలీలు ఉదయం 11గంటలకు ఇంటికి చేరుకోవాలని సూచించారు. ఎండ తగిలిన వ్యక్తి ఉంటే వారిని చల్లని నీడలో ఉంచాలన్నారు. శరీర ఉష్ణోగ్రతను తగ్గించటానికి తడి గుడ్డతో ఒళ్లంతా తూడవాలన్నారు. ఓఆర్‌ఎస్ నీళ్లు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సత్యానారాయణ, సూపర్‌వైజర్ చంద్రన్న వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీటీసీ బహిష్కరణ

గద్వాల అర్బన్: మహిళను వేధించిన కేసులో నిందితుడుగా ఉన్నందున మల్దకల్ మండలం విఠలాపురానికి సంబంధించిన మాజీ ఎంపీటీసీ షేక్షావలిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలను వేధిస్తే కాంగ్రెస్ పార్టీ సహించదన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఓ మహిళను వేధించిన విషయం సహించరానిదని, మహిళను వేధించిన షేక్షావలిని అందరి నిర్ణయం మేరకు కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపిద్దాం



అయిజ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నాగర్‌కర్నూల్ స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బింగుదొడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అనేక గ్రామాభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, బీజేవైఎం ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, వినోద్, విష్ణు, రాముడు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, నరేష్, మహేష్, సుధాకర్ ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత రైల్వేటీమ్

మానవపాడు: మండలం కేంద్రంలో ఈదమ్మ జాతర సందర్భంగా రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ. 1లక్ష రైల్వే టీమ్ సికింద్రాబాద్‌కు, రెండో బహుమతి రూ. 60వేలు మంత్రాలయం టీమ్‌కు, మూడో బహుమతి రూ.40వేలు విజయవాడ టీమ్‌కు, నాలుగవ బహుమతి రూ.25వేలు ఎల్‌బీ స్టేడియం టీమ్‌కు, ఐదో బహుమతి రూ.10వేలు ములుగు టీమ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఈరన్న, రమేష్, రవి, కాశీ, తదితరులు పాల్గొన్నారు.


మానవపాడులో మొదటి బహుమతి పొందిన రైల్వేటీమ్ సికింద్రాబాద్

హుండీ ఆదాయం రూ 5.94లక్షలు

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీని బుధవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టరు వెంకటేశ్వరమ్మ, ఈఓ పురేందర్ల ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.5,94,534ల ఆదాయం వచ్చిందని, గతేడాదితో పోలిస్తే రూ 1.69 లక్షలు ఆదాయం అధికంగా వచ్చినట్లు ఆలయ చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్న ఆంజనేయులు, అశోక్, రామ్‌గోపాల్, ఆలయ పూజారులు ఉన్నారు.


హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

ధరూరు: మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మండల జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు మహబూబ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి వంటి పథకాలు అందేవన్నారు. నేడు అదే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌ఉమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ దర్శెల్లి, తదితరులు పాల్గొన్నారు.


మన్నాపురంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ పద్మ

కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్

అలంపూర్: పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల వేల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఐటీబీపీ కేంద్ర సాయుధ బలగాలు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో వివిధ కాలనీలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆత్మవిశ్వాసం కల్పించారు. పార్లమెంట్ ఎన్నికలలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా పోలీస్ సిబ్బందితో కలిసి సాయుధ బలగాలతో విధులు నిర్వహించారు.


అలంపూర్ పట్టణంలో సాయుధ బలగాల ర్యాలీలో ఎస్ఐ నాగరాజు